క్లుప్తంగా

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ



గిడుతూరులో వరివిత్తనాలు చల్లుతున్న రైతు

మాకవరపాలెం: అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో వరి విత్తనాలు చల్లే పనుల్లో నిమగ్నమయ్యారు. ఏటా మండలంలో 1,200 హెక్టార్లలో వరిసాగవుతోంది. దీనికిగాను ప్రభుత్వం రైతులకు 90 టన్నుల వరకు రాయితీ విత్తనాలు పంపిణీ చేస్తోంది. ఇప్పటికే ఈ విత్తనాలను అందజేయడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి నారుమడులను సిద్ధం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ మడుల్లో విత్తనాలు చల్లుకుంటున్నారు. పి.పి.అగ్రహారం, గిడుతూరు, మల్లవరం, మాకవరపాలెం, పైడిపాల, లచ్చన్నపాలెం ప్రాంతాల్లోని నారుమడుల్లో విత్తనాలు చల్లుకునే పనుల్లో బిజీ అయ్యారు. మరోమారు భారీ వర్షాలు కురిస్తే మండల వ్యాప్తంగా నారుమడుల సిద్ధం చేసే పనులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు.

తక్షణ సాయం అందజేత



నగదు అందజేస్తున్న సర్పంచ్ నాగిరెడ్డి శతారినాయుడు

దేవరాపల్లి: వేచలంలో ఇటీవల మరణించిన వేచలం రెడ్డి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు తక్షణ సాయంగా సర్పంచ్ నాగిరెడ్డి శతారినాయుడు రూ.10 వేలు అందజేశారు. మృతుడికి వైఎస్సార్ బీమా కింద లక్ష రూపాయలు మంజూరు కాగా, అందులో భాగంగా అతడి భార్య దేవికి బీమా సాయం ఆదివారం అందజేశారు. గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ వి. నాగేశ్వరరావు, వార్డు మెంబర్ లెక్కల పరమేష్, వైఎస్సార్‌సీపీ రెడ్డి లకునాయుడు, బత్తి నాయుడు, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ రెడ్డి శేఖర్ పాల్గొన్నారు.

16న కె.జె.పురంలో మోదకొండమ్మ పండగ

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామ ముఖ్య ఆరాధ్య దైవం, మన్యం దేవత మోదకొండమ్మ పండగ ఈ నెల 16న ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి అమ్మవారి ఘటాలు ఊరేగింపు ప్రారంభమైంది. ఇప్పటికే ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్దారు. పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జాతర రోజు తెల్లవారుజాము నుంచి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయనున్నారు. ఈ జాతరకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరవుతారని ఉత్సవ కమిటీ చైర్మన్ కాళ్ల అప్పలనాయుడు, సభ్యులు ఆదివారం తెలిపారు.

రక్తహీనత గర్భిణులకు ప్రత్యేక సేవలు



గర్భిణులకు ఐరన్ సూక్రోజ్ ఇస్తున్న వైద్యాధికారి లీలాప్రసాద్

మాడుగుల రూరల్: కె.జె.పురం పీహెచ్‌సీలో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు ఐరన్ సూక్రోజ్ ఇస్తున్నామని వైద్యాధికారి కె. లీలాప్రసాద్ తెలిపారు. ఆదివారం ఇక్కడ పీహెచ్‌సీలో గర్భిణులకు, బాలింతలకు ఈ కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి సి.హెచ్. పుష్పమ్మ, ఎంపీహెచ్‌ఈవో పి. రామారావు, హెచ్‌వీ పుష్పకాంతం పాల్గొని ఆరోగ్య జాగ్రత్తలు గురించి వివరించారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్ యోజనలో భాగంగా సోమవారం గర్భిణులకు ప్రత్యేక తనిఖీలు, వివిధ పరీక్షలు నిర్వహించనున్నట్లు సీహెచ్‌వో తెలిపారు.

'సురక్ష' గ్రామసభలు నేడు

రావికమతం: మండలంలోని రావికమతం, కొత్తకోట-3 గ్రామ సచివాలయాల్లో సోమవారం జగనన్న సురక్ష గ్రామ సభలు నిర్వహించనున్నట్టు మండల ప్రత్యేకాధికారి రవికిరణ్ ఆదివారం తెలిపారు.

దేవరాపల్లి: మండలంలోని ఏ కొత్తపల్లి, ముసిడిపల్లి గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష క్యాంప్‌లను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి తెలిపారు.

అభివృద్ధికి కేరాఫ్ కింతలి వల్లాపురం

- రూ.1.63 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు
- రూ.14 లక్షలతో 12 సీసీరోడ్లు
- వీటితోపాటు కోట్లాది రూపాయల పనులు పూర్తి
- ఉత్తమ పంచాయతీగా పురస్కారం



కింతలి వల్లాపురం నుంచి పనుకు గదబూరుకు వేసిన పక్కా రోడ్డు



ప్రారంభానికి సిద్ధంగా గ్రామ సచివాలయ భవనం

మాడుగుల: ఒకప్పుడు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న కింతలి వల్లాపురం పంచాయతీ ఈ రోజు ఆదర్శంగా నిలుస్తోంది. ఇక్కడ గతంలో ఇంట్లో నుంచి బయటకు అడుగు పెడితే అధ్వాన రోడ్లు, చెత్తాచెదారాలు దర్శనమిచ్చేవి. ఇప్పుడు నాణ్యమైన రోడ్లుతోపాటు పరిశుభ్రమైన వీధులే కనిపిస్తున్నాయి. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో అభివృద్ధి చెందుతూ ఇటీవల ఉత్తమ పంచాయతీ పురస్కారం అందుకుంది.

పంచాయతీ పరిధిలో శరభన్నపాలెం, పనుకు గదబూరు, వెలంపాడు గ్రామాలున్నాయి. రెండు వేలకుపైగా జనాభాతోపాటు పది వార్డులున్నాయి. సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి తనను గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాభివృద్ధి కోసం విశేష కృషి చేస్తోంది. దీనిలో భాగంగా గ్రామ సమస్యలు ఎప్పటికప్పుడు డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నారు. వీటికి గ్రామ పంచాయతీ నిధులు జోడించి గ్రామాన్ని అభివృద్ధి చేస్తోంది.

గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులివే.. ఎన్ఆర్‌జీఈఎస్ నిధులు రూ.14 లక్షలతో 12 సీసీరోడ్లు నిర్మించారు. పంచాయతీ శివారు గిరి గ్రామం రహదారి కష్టాలతో ఇబ్బందులు పడుతుండడంతో రూ.88 లక్షలతో రెండు కిలోమీటర్ల మేర తారురోడ్డు ఏర్పాటు చేశారు. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవనాన్ని నిర్మించారు. రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.21.5 లక్షలతో నిర్మిస్తున్న ఆరోగ్య సబ్ సెంటరు పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. గ్రామ పంచాయతీ నిధులు రూ.3 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలు కలిపి పనుకు గదబూరులో కమ్యూనిటీ హాలు నిర్మించారు. కింతలి వల్లాపురంలో రూ.7 లక్షలతో రామాలయంలో మండపం నిర్మిస్తున్నారు. రూ.3 లక్షలతో సామాజిక మరుగుదొడ్లు, రూ.7.5 లక్షలతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం అందుబాటులోకి వచ్చాయి. కింతలి వల్లాపురంలో 60 వేల సామర్థ్యం కలిగిన మంచినీటి పథకం, శరభన్నపాలెంలో 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి పథకం, వెంపాడులో 20 వేల లీటర్ల మంచినీటి పథకంతోపాటు ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు జలజీవన్ మిషన్ నుంచి రూ.1.63 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే పనుకు గదబూరులో ఈ పనులు పూర్తయ్యాయి. గౌరిగెడ్డ వాగుపై వంతెనకు రూ.40 లక్షలు మంజూరు కాగా పనులు చేయాల్సి ఉంది. గ్రామంలో సీసీ డ్రైనేజీలు నిర్మాణ దశలో ఉన్నాయి.

డిప్యూటీ సీఎంకు రుణపడి ఉంటాం



మండలంలో వెనుకబడి ఉన్న మా పంచాయతీ అభివృద్ధితో ఉత్తమ పంచాయతీగా పుర స్కారం అందుకుంది. ఒకప్పుడు తాగునీటికి ఇబ్బందులుండేవి. నేడు మంచినీటి పథకంతోపాటు ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు నిధులు మంజూరు కావడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. నా భర్త రాంబాబు, గ్రామస్తుల సహాయ సహకారాలు అందిస్తున్నారు. కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరుకు డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారు. ఆయనకు గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– తాళ్లపురెడ్డి రాంబాయి, సర్పంచ్ కింతలి వల్లాపురం

మరో వారంలోగా జలజీవన్ మిషన్ పనులు

కింతలి వల్లాపురం పంచాయతీలో జలజీవన్ మిషన్ పనులు మరో వారంలోగా ప్రారంభం కానున్నాయి. గ్రామంలో పంట ఉత్పత్తి సేకరణ కేంద్రం భవనాన్ని నిర్మించాం. సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ కేంద్రాలకు భవనాలు పూర్తయ్యాయి. సర్పంచ్ కృషి ఫలింగా జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీగా అవార్డు వచ్చింది.

–ఎస్.అప్పారావు
పంచాయతీ కార్యదర్శి

విత్తన శుద్ధితో తెగుళ్లు దూరం



నారాయణరాజుపేటలో విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



శరభవరంలో రైతులకు విత్తన శుద్ధి గురించి అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



తురువోలులో అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

మాకవరపాలెం: విత్తన శుద్ధితో తెగుళ్లు దూరం చేయొచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. ఆదివారం నారాయణరాజుపేటలో వరిసాగు చేసే రైతులకు ప్రకృతి సాగు పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా ఆవు మూత్రం, పేడ, సున్నం, పుట్టమన్నుతో తయారు చేసిన బీజామృతంతో విత్తన శుద్ధి చేయించారు. రైతులకు ఈ జీవామృతం తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వల్ల తెగుళ్లు, పురుగులను దరిచేరకుండా ఉండమేగాక విత్తనం మొలక శాతం బాగుంటుందని తెలియజేశారు. ప్రకృతి సేద్యం సిబ్బంది కవిత, మంగ, అప్పారావు, సుదర్శన్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

రోలుగుంట: జాతీయ ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం శరభవరంలో రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరినారు పోసే సమయంలో విత్తనాలను ప్రకృతి పద్ధతిలో ఎలా శుద్ధి చేయాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ శాఖ స్థానిక ఇన్‌చార్జులు దేవి, సాంబశివరావు మాట్లాడుతూ వరి విత్తనాలను శుద్ధి చేయడం వల్ల 21 రోజుల పాటు తెగుళ్లను నియంత్రిస్తుందని, మొలకశాతం మెరుగ్గా ఉంటుందని వివరించారు వరినారు మడులలో సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో పంటలకు ఎంతో మేలు

చీడికాడ: విత్తన శుద్ధితో పంటలకు ఎంతో మేలు చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అన్నారు. ఆదివారం తురువోలు యూనిట్ పరిధిలో వరినారు పోస్తున్న రైతులను కలిసి బీజామృతంతో విత్తన శుద్ధి చేసి చూపించారు. ఈ సందర్భంగా విత్తన శుద్ధి వల్ల కలిగే పలు ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. ఐసీఆర్పీలు, ఐబీఐసీఆర్పీలు కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేడు కింతలి, కింతలి వల్లాపురంల్లో 'గడప గడపకు'

మాడుగుల రూరల్: మండలంలో కింతలి, కింతలి వల్లాపురం గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు హాజరై గడప గడపకు తిరిగి సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ఎ.భీమవరం పాల సంఘం అధ్యక్షుడిగా రమణ

- అభినందించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



అధ్యక్షుడు రమణను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: ఉత్తమ సేవలతో పాల సంఘాన్ని మరింతగా అభివృద్ధి చేయాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సూచించారు. ఎ.భీమవరం పాల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన తాడి రమణ తారువ క్యాంపు కార్యాలయంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా రమణను దుశ్శాలువాతో డిప్యూటీ సీఎం సన్మానించారు. రైతులకు అన్ని విధాలుగా చేదోడు వాదోడుగా ఉంటూ సంఘాన్ని లాభాల బాటలో తీసుకువచ్చేలా కృషి చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తర్రా శేషు, పాల సంఘం డైరెక్టర్లు తాడి నాగేశ్వరరావు, తర్రా మోహన్‌రావు, శంకర్రావు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

రావికమతం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకన్నబాబు ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలన్నారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. అన్ని శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

గిరిజన గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణం

- 14 శివారు గ్రామాలకు రూ. 42 లక్షలతో ఏర్పాటు



రామచంద్రపురంలో నిర్మించిన సీసీరోడ్డు

మాడుగుల రూరల్: గిరిజన గ్రామాల్లో మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. దీనిలో భాగంగా శంకరం గ్రామ పంచాయతీ శివారు గిరిజన గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి రూ.42 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో పంచాయతీ పరిధిలోని 14 గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. రామచంద్రపురం, మామిడిపాలెం, శంకరం, తదితర గిరిజన గ్రామాల్లో రహదారుల నిర్మాణాలు చేపట్టారు. వర్షం పడితే గిరిజన గ్రామాల్లో మట్టిరోడ్లపై ప్రయాణం కష్టతరంగా ఉండేది. ఎటువంటి వాహనాలు వెళ్లే పరిస్థితి ఉండేది కాదు. ఈ నేపథ్యంలో గిరిజన గ్రామాల అభివృద్ధిలో భాగంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఈ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేయించారు. దీంతో తమ రోడ్డు కష్టాలు తీరాయని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శంకరం పంచాయతీ పరిధిలో సీసీరోడ్లతోపాటు కోట్లాది రూపాయలతో భారీ రహదారుల నిర్మాణం చేపట్టారు. కొన్ని గిరిజన గ్రామాల్లో ఇంకా పూర్తికాని రహదారులకు నిధులు మంజూరు చేశారు. వీటితోపాటు విద్య, వైద్య సదుపాయాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మెరుగుపడ్డాయని ఈ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భోగాపురంలో సోలార్ వెలుగులు

- ఎంపీ ల్యాడ్స్ రూ. 5 లక్షలతో వీధి దీపాల ఏర్పాటు



సోలార్ దీపాలు



భోగాపురంలో సోలార్ దీపాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

చోడవరం: భోగాపురం గ్రామస్తులకు ఎట్టకేలకు చీకటి కష్టాలు తొలగాయి. సోలార్ వీధి దీపాలను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ప్రారంభించారు. ఇక్కడ రైతులు రాత్రిళ్లు పొలాల్లోంచి గ్రామానికి రావడానికి చీకటిలో నానా కష్టాలు పడేవారు. వీరి పొలాలు శారదానది ఏటి అవతల ఉండటంతో రోజంతా వ్యవసాయ పనులు చేసుకుని రాత్రి 7గంటల సమయంలో ఇళ్లకు చేరేవారు. ఆ సమయంలో చీకటి పడి రోడ్డుపై వెలుతురు లేక చాలా ఏళ్లుగా నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేక విద్యుత్ లైన్లు వేయడానికి ఎక్కువ ఖర్చు అవుతుండటంతో వీరి సమస్యకు ఇప్పటి వరకూ పరిష్కారం లభించలేదు. ఈ పరిస్థితుల్లో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులంతా ఎమ్మెల్యే, విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన చొరవ తీసుకొని సోలార్ విద్యుత్ వీధి దీపాలు ఏర్పాటు చేయడమే సమస్యకు పరిష్కారమని భావించారు. వీటి ఏర్పాటుకు నిధుల కోసం అనకాపల్లి ఎంపీ బీవీ సత్యవతికి సమస్యను వివరించారు. వెంటనే ఆమె స్పందించి ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ. 5 లక్షలు నిధులు కేటాయించారు. ఈ నిధులు మంజూరు కావడంతో నెడ్‌క్యాప్ సంస్థ ద్వారా సోలార్ వీధి దీపాలు ఏర్పాటు చేసే పనులు ఇటీవల చేపట్టారు. మొత్తం 19 యూనిట్లు మంజూరు చేశారు. భోగాపురం–గోవాడ రహదారి, పొలాలకు వెళ్లే ప్రధానంగా చీకటిగా ఉండే రహదారి ప్రదేశాలతోపాటు గ్రామంలో కరెంటు లేని సమయంలో వీధి దీపాల కాంతులు ఉండేలా పలు జంక్షన్ల వద్ద ప్రత్యేక స్తంభాలు ఏర్పాటు చేసి సోలార్ దీపాలు ఏర్పాటు చేశారు. 19 ప్రదేశాల్లో ఈ దీపాలను ఏర్పాటు చేయడంతోపాటు వాటిని ఎంపీటీసీ ఆడారి కోటిభూలోక, మాజీ సర్పంచ్ దొడ్డి రమణారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎస్.వి.ఎస్. గంగాధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి సత్యనారాయణ, సూరిశెట్టి గణేష్, రాపేటి రామారావు, నెడ్‌క్యాప్ సంస్థ జిల్లా మేనేజర్ ఎం.వి.కె. రాజు ప్రారంభించారు. దీర్ఘకాలిక సమస్య పరిష్కారం కావడంతో ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే ధర్మశ్రీకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

తాతా బాగున్నావా...పింఛన్ అందుతోందా..

- ప్రతి గడపలోనూ ఎమ్మెల్యే గణేష్ ఆత్మీయ పలకరింపు



లబ్ధి చేకూరిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: తాతా బాగున్నావా.. పింఛన్ అందుతోందా.. అమ్మా ప్రభుత్వం నుంచి సక్రమంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. అంటూ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పలువురిని ఆప్యాయంగా పలకరించారు. వారి నుంచి సానుకూల స్పందన రావడంతో ఆనందం వ్యక్తం చేశారు. మండలంలోని అప్పన్నపాలెం, బంగారయ్యపేట గ్రామాల్లో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తొలుత గ్రామానికి వచ్చిన ఆయనకు గ్రామ మహిళలు చిడతల కోలాటంతో ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలోని సమస్యలను నమోదు చేయించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగేళ్లలో ప్రభుత్వం 98 శాతం హామీలను నెరవేర్చిందన్నారు. పార్టీలు, కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందంచిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. అర్హత ఉంటే ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, పార్టీ అధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, ఎంపీటీసీ బోళెం వెంకటేష్, ఎంపీడీవో జయమాధవి, గ్రామ నాయకులు సత్తిబాబు, సుర్ల జగన్, గుడివాడ శివ, పీఏసీఎస్ మురళీ, సర్పంచ్ శెట్టి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు లగుడు శ్రీనివాసరావు, పెట్ల చిన అప్పలనాయుడు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి సేవా మార్గం అనుసరణీయం

- సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు వైశ్యరాజు కృష్ణంరాజు



సత్యసాయి భక్తులకు పుస్తకాలను అందించిన వైశ్యరాజు

కె.కోటపాడు: సత్యసాయి చూపిన సేవా మార్గం అనుసరణీయమని సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు వైశ్యరాజు కృష్ణంరాజు తెలిపారు. ఆదివారం కింతాడలోని రామసత్యసాయి మందిరంలో సత్యసాయి భక్తులు ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి మార్గాన పయనించి పది మందికి ఒక్కొక్కరూ సహాయ కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. అనంతరం భక్తులకు సాయి లిఖిత నామ జపం పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి భక్తులు కశిరెడ్డి అప్పలనాయుడు, కామరాజు, రాజశేఖర్, కన్నూరు అప్పలనాయుడు, బండారు నారాయణపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పంచాయతీరాజ్ అతిథి గృహ నిర్మాణం



మాడుగులలో నిర్మాణంలో పంచాయతీరాజ్ అతిథి గృహం

మాడుగుల రూరల్: నియోజకవర్గ కేంద్రం మాడుగులలో పంచాయతీరాజ్ అతిథి గృహం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంజూరు చేసిన రూ 1.25 కోట్లతో స్థానిక తాచేరు నది ఒడ్డున అన్ని హంగులతో దీన్ని నిర్మిస్తున్నారు. ఇంతవరకు 80 శాతం నిర్మాణం పూర్తయింది. ఇక్కడ గతంలో ఆర్అండ్‌బీ శాఖ నిర్మించిన అతిథి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గత ప్రభుత్వ హయాంలో దీనికి కనీసం మరమ్మతులు చేపట్ట లేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే కొత్తగా పంచాయతీ రాజ్ అతిథి గృహం నిర్మాణానికి డిప్యూటీ సీఎం శ్రీకారం చుట్టారు. ఈ ప్రాంతంలో అతిథి గృహం నిర్మించడంతో ఈ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీని నిర్మాణ పనులను ఈ నెల 8న డిప్యూటీ సీఎంతో కలిసి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి స్వయంగా పరిశీలించారు.

'పంచ్ ప్రభాకర్‌పై అట్రాసిటీ నమోదు చేయాలి'



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

రావికమతం: విదేశాల్లో ఉంటూ దళితులను కించపరిచే విధంగా మాట్లాడిన పంచ్ ప్రభాకర్‌రెడ్డిపై సుమోటోగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తకోటలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు బుంగా బుల్లిబాబు, పూడి దేవ, పూడి అప్పారావు మాట్లాడుతూ అంబేడ్కర్ దళితులకే కాదు, దేశంలో అందరూ బాగా చదువుకోవాలన్న సంకల్పంతో తన మేధాశక్తిని పంచారన్నారు. అజ్ఞానిలా మాట్లాడిన ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలన్నారు.

అంబులెన్స్ సేవల్లో ముందుండాలి



మాట్లాడుతున్న జోనల్ ఫ్లీట్ మేనేజర్ రవికిరణ్

నర్సీపట్నం: ప్రభుత్వం పేదలకు సత్వర సేవలు అందించేందుకు తీసుకొచ్చిన 108, 104, 102 అంబులెన్స్ సేవలను అందించటంలో పైలెట్లు ముందుండాలని జోనల్ ఫ్లీట్ మేనేజర్ రవికిరణ్ సూచించారు. ఎమర్జెన్సీ అంబులెన్స్ పైలెట్లతో ఆదివారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు అత్యవసర సేవలు అందించటంలోనూ విధి నిర్వహణలోనూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనాల కండిషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మరమ్మతులకు గురైతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి రిపేర్ చేయించి వాహనాన్ని రన్నింగ్‌లో ఉంచాలన్నారు. ప్రభుత్వ నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమర్థవంతంగా పని చేసి ప్రభుత్వానికి మంచి తీసుకురావాలన్నారు. ఆస్పత్రుల్లో ప్రసవం జరిగిన తర్వాత తల్లీబిడ్డను సురక్షితంగా 102 వాహనంలో ఇంటి వద్దకు చేర్చాలన్నారు. ప్రమాద సమయంలో ఏమాత్రం ఆలస్యం చేయకుండా క్షణాల్లో ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రుల్లో చేర్చాలన్నారు.

ఘాట్‌రోడ్‌లో మోదకొండమ్మ పాదాల పండగ



ఘటాలతో మోదకొండమ్మ పాదాలు గుడికి వెళ్తున్న వర్తక సంఘం సభ్యులు



డిప్యూటీ సీఎం బూడిని సత్కరిస్తున్న వర్తక సంఘం సభ్యులు

మాడుగుల: మండలంలో ఘాట్‌రోడ్ జంక్షన్‌లో ఆదివారం మోదకొండమ్మ పాదాలు పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతి రూపమైన 108 ఘటాలతో వర్తక సంఘ సభ్యులతోపాటు, భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన్ను వర్తక సంఘ సభ్యులు దుశ్శాలువా కప్పి సత్కరించారు. దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.